సాక్షి
కుమురం భీం

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



వీవోఏల నిరవధిక సమ్మె
తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ వీవోఏలు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఐకేపీ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 9లో▸

నలుగురు విద్యార్థులకు కరోనా!
కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఓ గురుకుల పాఠశాలలో నలుగురు విద్యార్థులకు కరోనా పాజిటివ్ వచ్చినట్లు సమాచారం. వారం రోజులుగా ఏడుగురు విద్యార్థులు జ్వరంతో బాధపడుతుండగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించారు. నలుగురికి పాజిటివ్ నిర్ధారణ కావడంతో ఇంటికి పంపించినట్లు తెలిసింది. ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా అలాంటిదేమీ లేదన్నాడు.

గరిష్ఠం/కనిష్ఠం
42.7 /27.5

వాతావరణం
ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటాయి. వేడిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్	సహర్
బుధ : 6:34	గురు : 4:31

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం
ఆసిఫాబాద్: జిల్లా క్రీడా, యువజన శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మే 1 నుంచి 31 వరకు సమ్మర్ కోచింగ్ నిర్వహణకు సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల సీనియర్ క్రీడాకారులు ఈ నెల 22లోగా క్రీడల సర్టిఫికెట్ జత చేసి జిల్లా కేంద్రంలోని డీవైఎస్‌వో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8008090626, 7382148056 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'గురుకులాల్లో సమ్మర్ క్యాంప్‌లు రద్దు చేయాలి'



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులాల్లో సమ్మర్ క్యాంపుల పేరిట విద్యార్థులు, ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎల్లయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపుల పేరిట వేసవిసెలవుల్లో కూడా క్లాసులు నిర్వహించడం సరికాదన్నారు. మండుతున్న ఎండలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. దీనిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందులాల్, రమేశ్, హేమంత్ షిండే, సంతోష్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి
కాగజ్‌నగర్‌టౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భీమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రాజీవ్‌చౌక్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిత్యాన్నదానం గొప్ప సంకల్పం



గోశాల ప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌టౌన్: నిత్యాన్నదానం గొప్ప సంకల్పమని, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సేవలు అభినందనీయమని ఆలేరు శ్రీ మాతా పితృగోశాల గోక్షేత్రం పంచాంగ కర్త, నిర్వాహకులు బిందు మాధవశర్మ, పులి సీతారాం శర్మ అన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిత్యాన్నదాన సత్రాన్ని మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు ఘనంగా సన్మానించారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలుడి పేరు లక్కీ (01). కౌటాల మండలంలోని పార్డి గ్రామానికి చెందిన నవుగడే కారు–శశికళ దంపతులకు ఒక్కగానొక్క సంతానం. తమ కుమారుడు జీవితంలో అదృష్టవంతుడు కావాలని లక్కీ అని పేరు పెట్టుకున్నారు. కానీ అతని పేరులో ఉన్న లక్కీ నిజజీవితంలో లేకుండా పోయింది. ఇటీవల బాలునికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న వైద్యులకు చూపించారు. అయినా తగ్గకపోవడంతో మెరుగైన చికిత్సకోసం వరంగల్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో ఈ నెల 15న శనివారం మృతి చెందాడు. అదేరోజు పెంచికల్‌పేట్ మండలంలోని మొర్లిగూడకు చెందిన సోంటెంకి మనోహర్ (45) జ్వరంతో బాధపడుతూ వరంగల్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒకేరోజు ఇద్దరు జ్వరంతో మృతి చెందడంతో జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు.

సన్.. స్ట్రోక్!





జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- జిల్లాలో ఉష్ణోగ్రతలతో పాటే పెరుగుతున్న జ్వరాలు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- తలనొప్పి, నీరసం, నాలుక తడారిపోవడం లక్షణాలు..
- నీళ్లు ఎక్కువ తాగాలని, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలంటున్న వైద్యులు

కౌటాల(సిర్పూర్): ప్రజలు వర్షాకాలంలో ఎక్కువగా జ్వరాల బారిన పడుతుంటారు. కానీ ప్రస్తుతం కాలాలకు అతీతంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో వేసవిలోనూ సైతం జ్వరాలు విజృంభిస్తున్నాయి. సాధారణంగా వేసవి కాలంలో కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా, టైఫాయిడ్ వంటి కేసులు వస్తుంటాయి. వేసవిలో అటు పగటి ఉష్ణోగ్రతలతో పాటు ఇటు జ్వరాల కేసులు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఎన్నడూ లేనివిధంగా ఎండలు మండుతుండడంతో ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో జ్వరాలతో ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య కూడా పెరుగుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. వాంతులు, విరేచనాలు, జలుబు, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలతో ప్రజలు సతమతమవుతున్నారు.

వైరల్ జ్వరాలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏప్రిల్ మొదటివారంలో అకాల వర్షాలు కురిశాయి. దీంతో పాటు భానుడు కూడా భగభగ మండుతున్నాడు. వేడిగాలుల కారణంగా వైరల్ జ్వరాలు సోకుతున్నాయి. కండరాలు పట్టేయడం, సొమ్మసిల్లి పడిపోవడం, నీరసించిపోవడం, వాంతులు, నీళ్ల విరేచనాలు, కళ్లు తిరగడం, తలనొప్పి, తదితర లక్షణాలు ప్రధానంగా కనిస్తుండడం గమనార్హం. ఎండలో తిరిగేవారు ఎక్కువగా ఈ జ్వరాల బారిన పడుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు.

ఆస్పత్రులకు రోగుల తాకిడి

వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా వైరల్ జ్వరాలతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో నాలుగు రోజులుగా ఓపీ వివరాలు

తేదీ	ఓపీ
15	224
16	105
17	290
18	185



చలికాలం నుంచి వేసవి కాలంలోకి మారే సమయంలో ఎండలు భగభగ మండుతున్నాయి. అకాల వర్షాల కారణంగా రాత్రుల్లో చలిగాలులు సైతం వీస్తున్నాయి. దీంతో చిన్నారులు, పెద్దలు జలుబు, దగ్గు, జ్వరంతో పాటు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో రోజుకు 290కి పైగా ఓపీ నమోదవుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇంట్లో ఒకరికి జ్వరం వచ్చిందంటే కుటుంబ సభ్యులందరికీ సోకుతోంది. దీంతో కుటుంబమంతా కలిసి ఆస్పత్రిలో చేరే పరిస్థితి ఏర్పడుతోందని ప్రజలు వాపోతున్నారు. వైరల్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

వైద్యశాఖ ప్రత్యేక నజర్

జిల్లాలోని కౌటాల మండలంలోని పార్డి, కౌటాల, పెంచికల్‌పేట్ మండలంలోని మొర్లిగూడ, బెజ్జూర్ మండలంలోని పలు గ్రామాలతో పాటు ఆయా మండలాల్లోని గ్రామాల్లో వైరల్ జ్వరాలు సోకుతున్నాయి. దీంతో జిల్లా వైద్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మొర్లిగూడలో రెండుసార్లు వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగుల రక్తనమూనాలు సేకరించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి జ్వరాల నియంత్రణ, వేసవిలో వాతావరణ మార్పుల పై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి డివిజన్ పరిధిలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వైద్యశాఖ అధికారులు వెల్లడించారు.



మొర్లిగూడలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

జాగ్రత్తలు పాటించాలి



పెంచికల్‌పేట్ మండలంలోని మొర్లిగూడలో రెండుసార్లు వైద్యశిబిరం ఏర్పాటు చేశాం. వాతావరణంలో మార్పుల కారణంగా కొన్ని రోజులుగా జిల్లాలోని వివిధ ఆస్పత్రుల్లో ఓపీ కేసులు పెరుగుతున్నాయి. వైరల్ జ్వరాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. ఎండలో తిరగడం, కలుషిత నీరు, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధులు వస్తాయి. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలి. జలుబు, తుమ్ములు, ఒళ్లునొప్పులతో జ్వరం వస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయి.

– రామకృష్ణ, జిల్లా వైద్యాశాఖ అధికారి, ఆసిఫాబాద్

అసంపూర్తిగా జేబీసీసీఐ చర్చలు
- అలవెన్స్‌ల పెంపు కుదురదన్న యాజమాన్యం
- మే నెలకు సమావేశం వాయిదా



సమావేశంలో పాల్గొన్న వివిధ కార్మిక సంఘాల నేతలు

శ్రీరాంపూర్: బొగ్గు గనికార్మికుల 11వ వేతన ఒప్పందానికి సంబంధించిన జేబీసీసీఐ చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. మంగళవారం కోల్‌కత్తాలో జేబీసీసీఐ–11 సమావేశం నిర్వహించారు. కోలిండియా చైర్మన్ అగర్వాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జాతీయ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. చైర్మన్ మాట్లాడుతూ దేశంలో ఏ పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో లేనంతగా మినిమం గ్యారెంటీ బెన్‌ఫిట్ 19 శాతం పెంచామని, ఇంత పెద్ద మొత్తం పెరుగుదలను ప్రభుత్వంతో మాట్లాడి ఆమోదించే బాధ్యత తనదేనని అన్నారు. జాతీయ సంఘాల ప్రతినిధులు అలవెన్సుల పెంపుపై చర్చ ప్రారంభించారు. కొన్ని అలవెన్సుల పెంపుపై యాజమాన్యం తన అంగీకారాన్ని తెలియజేసింది. 19 శాతం మినిమం గ్యారెంటీ బెన్‌ఫిట్‌తోనే ఎక్కువ పెరుగదల వచ్చిందని, అలవెన్సులు ఎక్కువగా పెంచడం కుదరదని స్పష్టం చేసింది. డీఏను 100 శాతం న్యూట్రలైజేషన్ చేస్తామని, అండర్‌గ్రౌండ్ అలవెన్సు 10 శాతం ఫ్రీజింగ్‌తో ఇస్తామని, నైట్‌షిఫ్ట్ అలవెన్సు రూ.35 నుంచి రూ.50కు పెంచుతామని, చార్జీ అలవెన్స్‌ను ఇప్పుడు ఉన్నట్లే ఇస్తామని పేర్కొంది. ఇంక్రిమెంట్ బేసిక్‌పై 3శాతం పాత పద్ధతిలోనే ఇస్తామని, నర్సింగ్ అలవెన్సును రూ.400 నుంచి రూ.500కు పెంచుతామని యాజమాన్యం పేర్కొంది. అటిండెన్స్ బోనస్ హాజర్లతో సంబంధం లేకుండా ఇస్తామని, స్ప్రా, డీఏ కొనసాగిస్తామని యాజమాన్యం పేర్కొందని చర్చల్లో పాల్గొన్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ.సీతారామయ్య 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు. వీటిపై కార్మిక సంఘాలు, యాజమాన్యానికి మధ్య అంగీకారం కుదరలేదని, దీంతో సమావేశాలను మే నెలకు వాయిదా వేశారని పేర్కొన్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి
- డీజీపీ అంజనీ కుమార్
- జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న డీజీపీ అంజనీకుమార్

ఆసిఫాబాద్: జిల్లాలోని అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని డీజీపీ అంజనీ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఎక్సైజ్, వ్యవసాయ, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎస్పీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వరి ధాన్యంపై ప్రత్యేక నిఘా కోసం జిల్లా సరిహద్దుల్లో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాంకిడి, సిర్పూర్(టి) మండలంలోని వెంకట్రావుపేట్ ఎక్స్ రోడ్, హుడుక్కి ఎక్స్‌రోడ్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాకు అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశం, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జ్యోతి కిరణ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి
- ఎస్పీ సురేష్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ సురేష్ కుమార్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేయాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీకేసులో ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పనిచేయాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతీ విషయాన్ని కూలంకశంగా పరిశోధన చేసి పారదర్శకమైన విచారణ చేపట్టి ఫైనల్ చేయాలన్నారు. పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించాలన్నారు. సీసీటీఎన్‌ఎస్‌లో డాటా ఎంట్రీ ప్రతీరోజు మానిటర్ చేయాలని సంబంధిత ఎస్సైలకు సూచించారు. సైబర్ నేరాల నియంత్రణపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వర్టికల్స్ రివార్డులు అందజేశారు. అదనపు ఏఆర్ ఎస్పీ భీమ్‌రావు, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ సుధాకర్, సీఐలు పవన్ కుమార్, కరీముల్లాఖాన్, రాణాప్రతాప్, శ్రీనివాస్, బుద్ధస్వామి, నరేందర్, రాము, పాషా, ఎస్సైలు, డీపీవో ప్రహ్లాద్ పాల్గొన్నారు.

పల్లెల్లో పత్తాలాట!



- జిల్లాలో పెరుగుతున్న జూదం
- వృత్తిలా భావిస్తున్న పేకాటరాయుళ్లు
- ఈ ఏడాది ఇప్పటి వరకు 40 మందిపై కేసు
- రూ.1,32,400 నగదు స్వాధీనం

కౌటాల(సిర్పూర్): కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో పేకాట జోరుగా సాగుతోంది. డివిజన్ పరిధిలోని కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, దహెగాం, సిర్పూర్(టి) మండలాల్లో పేకాట జోరుగా ఆడుతున్నారు. పోలీసుల దాడుల్లో కొంతమంది జూదరులు పట్టుబడుతున్నా పరిస్థితిలో మార్పురావడం లేదు. రోజురోజుకూ పేకాటరాయుళ్ల అరెస్టు కేసులు పెరుగుతుండడంతో దందా జోరుగా సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. పట్టుబడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం లేకపోవడంతో జూదానికి అలవాటుపడిన వారు తమ ప్రవర్తనను మానుకోవడం లేదు. దీంతో జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఈ పేకాట సంస్కృతి నేడు మండల కేంద్రాలతో పాటు గ్రామాలకు సైతం వ్యాపించింది. యువత కూడా పేకాటకు బానిసలు అవుతుండడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. పోలీసులు సైతం మొక్కుబడిగా దాడులు నిర్వహిస్తుండడంతో గ్రామాల్లో పేకాట దందా జోరుగా కొనసాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

వృత్తిలా భావిస్తూ..

పేకాట.. మద్యం.. కోడిపందాలు.. ఇవన్నీ వ్యసనాలు. 'పుర్రెకో బుద్ధి.. జిహ్వకో రుచి' అన్నట్లుగా ఒక్కోమనిషి ఒక్కో వ్యసనం బారిన పడుతుంటారు. వీటి మోజులో పడ్డారంటే జీవితాలు ఛిద్రం కావాల్సిందే. సరదగా ఆడుకునే పేకాట కొందరికి వ్యసనంలా మారుతోంది. జూదానికి అలవాటు పడినవారు అదో వృత్తిలా భావిస్తున్నారు. ఉద్యోగానికి వెళ్లేవారిలాగానే ఉదయం వెళ్లి సాయంత్రం వరకు, కొన్ని సందర్భాల్లో రాత్రుళ్లోనూ అక్కడే గడుపుతున్నారు. పెద్దమొత్తంలో డబ్బులు ఆడేవారంతా ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు హోటళ్లు, అటవీ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారు. పోలీసులు ఈ నెలలో ఇప్పటి వరకు పేకాట ఆడుతున్న 13 మందిపై కేసు నమోదు చేసి రూ.73,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

శివారు ప్రాంతాల్లోనూ..

శివారు ప్రాంతాలనూ లక్ష్యంగా చేసుకున్న కొంత మంది జూదాన్ని యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. దూరంగా ఉండే ప్రాంతంలో చెట్లకింద, తోటలు, పంట పొలాలను వేదికగా మార్చుకుంటున్నారు. ఆడేవారికి మినహా ఇతరులకు ఏమాత్రం సమాచారం లేకుండా ఔత్సాహిక సభ్యులు బృందంగా ఏర్పడి తాము నిర్ణయించుకున్న స్థలానికి చేరుకుంటున్నారు. మద్యం సేవించడం, భోజనం చేయడం అక్కడే కానిస్తున్నారు. సమయానికి డబ్బులు లేకపోతే అప్పులు చేసో, ఇంట్లో ఉన్న వస్తువులు తాకట్టు పెట్టో ఆటకోసం వెళ్తున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ప్రధానంగా మూడుముక్కలు, రమ్మీ ఆటలు ఆడుతారు. జూదరులు డబ్బులు పెట్టే స్థాయిని బట్టి గ్రూపులుగా విభజించి ఆట ఆడుతున్నారు.


భయపడటం లేదు..

పేకాట ఆడుతూ పట్టుబడుతున్న సంఘటనలు ఆయా ప్రాంతాల్లో తరచూ చోటు చేసుకుంటున్నాయి. అయినప్పటికీ ఈ జూదానికి అలవాటు పడ్డవారు ఏమాత్రం భయపడడం లేదు. ఒకవేళ పోలీసులకు పట్టుబడినా పెద్దగా శిక్షలేం లేకపోవడంతో న్యాయస్థానంలో జరిమానా కట్టి బయటకు రావచ్చన్న ధీమానే వారిని పేకాట వైపు మళ్లిస్తోందన్న విమర్శలున్నాయి. పేకాట కారణంగా పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వ్యక్తులు పేకాట వ్యసనానికి గురై ఇళ్లు గుల్ల చేసుకుంటున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి పేకాటకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆయా మండలాల్లో సంఘటనలు..

- ఈ ఏడాది జనవరి 7న దహెగాం మండలంలోని హత్తిని శివారులో పేకాట ఆడుతున్న పది మందిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. నిందితుల వద్ద నుండి రూ. 24,800 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.
- 15న కౌటాల మండలంలోని వైగాం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. వారి వద్ద నుండి రూ.9 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- 16న కాగజ్‌నగర్ మండలంలోని బోడపల్లి శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.23 వేలు స్వాధీనం చేసుకున్నారు.
- 26న సిర్పూర్(టి) మండలంలోని భూపాలపట్నం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.2,100 నగదును స్వాధీనం చేసుకున్నారు.
- ఏప్రిల్ 16 న సిర్పూర్(టి) మండలం చింతకుంట గ్రామ శివారులోని పేకాట స్థావరం పై పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి రూ.68 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- 17న కౌటాల మండలం కన్నెపల్లి శివారులో పోలీసులు దాడులు నిర్వహించి ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.5,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.


అవగాహన కల్పిస్తున్నాం



ఇటీవల కౌటాల, సిర్పూర్ (టి) మండలాల్లో జూదం ఆడుతున్నట్లు మా దృష్టికి రావడంతో దాడులు నిర్వహించి పేకాట రాయుళ్లపై కేసులు నమోదు చేశాం. పేకాట ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దని గ్రామీణ ప్రాంతాల్లో యువతకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో జూదం నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అక్రమ దందాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– సాధిక్ పాషా, సీఐ, కౌటాల

నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలి
- డీఈవో అశోక్



మాట్లాడుతున్న డీఈవో అశోక్

కెరమెరి(ఆసిఫాబాద్): ఈ నెలాఖరులోగా మన ఊరు, మన బడి పనులను పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీ.అశోక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు మాసాల క్రితమే పనులన్నీ పూర్తికావాల్సి ఉన్నప్పటికీ ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. మండలంలో 19 మాంబ్ బడులు ఉన్నప్పటికీ ఇప్పటికీ ఒకటే ప్రారంభోత్సవం చేశామని, మిగిలిన వాటిని గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని పాఠశాలలకు డబ్బులు రాలేదు? నిర్మాణాలు ఏఏ దశల్లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఎంబీ రికార్డు చేసిన పక్షం రోజుల్లోనే బిల్లులు మంజూరవుతాయన్నారు. సమావేశంలో ఎస్‌వోలు సుభాష్, భరత్, ఎంఈవో సుధాకర్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, ఏఈ నజీమొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెక్యూరిటీ గార్డుల సమస్యలు తీర్చాలి

- ఏఐటీయూసీ డిమాండ్



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్అండ్‌పీసీ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ యూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, బ్రాంచీ సెక్రెటరీ మోతుకూరి కొమురయ్యల ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం వద్ద గల డిపార్టుమెంట్ కార్యాలయంలో ఏరియా సెక్యూరిటీ అధికారి మురళీ మోహన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఫిట్ సెక్రెటరీ ఆడెపు మల్లిఖార్జున్, నాయకులు గునిగంటి కొమురయ్య, శ్రీధర్, రాజేంద్ర ప్రసాద్‌లు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి దుప్పి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని జనావాసాల్లో దుప్పి నాలుగు గంటలు హల్‌చల్ చేసింది. సీఈఆర్ క్లబ్ వెనుక వైపు గల అటవీ ప్రాంతం నుంచి ఉదయం దుప్పి రావడంతో స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. దుప్పిని పట్టుకోవడానికి ప్రయత్నించగా మొదటి జోన్ లోని గోడలు దూకుతూ సుమారు నాలుగు గంటల వరకు హల్‌చల్ చేసింది. డెప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి సంతోష్ పర్యవేక్షణలో దుప్పిని పట్టుకుని బొక్కలగుట్ట ఏరియాలోని అటవీ ప్రాంతంలో వదిలారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు



చెక్ పోస్ట్‌వద్ద సిబ్బంది

సిర్పూర్(టి): మండలంలోని రెండు అంతర్రాష్ట్ర రహదారుల్లో పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని సిర్పూర్(టి)–మాకిడి అంతర్రాష్ట్ర రహదారిలో స్థానిక రైల్వేస్టేషన్ ఏరియా చౌరస్తా వద్ద, మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలో వెంకట్రావ్‌పేట్–పోడ్సా అంతర్రాష్ట్ర రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర నుంచి ధాన్యాన్ని తెలంగాణలో విక్రయించేందుకు తీసుకురాకుండా వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ, పోలీసు శాఖలతో కలిసి చెక్‌పోస్టులను జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని మెరాజ్ మసీదు ప్రాంతంలో మంగళవారం ఉదయం అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిపై కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వ్యక్తిని అదుపులో తీసుకొని విచారించారు. బల్లార్షా పట్టణానికి చెందిన సల్లుఖాన్‌గా గుర్తించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు దొంగలించి స్థానిక ఎస్పీఎం నీలగిరి ప్లాంటేషన్‌లో దాచి పెట్టినట్లు నిందితుడు అంగీకరించాడు. రెండుఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

నిప్పుతో జాగ్రత్త..!

- చిన్నచిన్న తప్పిదాలతోనే అగ్ని ప్రమాదాలు
- అప్రమత్తతతోనే నివారణ
- ఈ నెల 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు

మంచిర్యాలక్రైం: చిన్నచిన్న తప్పిదాలతోనే నిత్యం ఏదో ఓ చోట అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తున్నాయి. ప్రమాద స్థలాలకు అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని నష్టాన్ని నివారించే అవకాశం చాలా తక్కువే. అందుకే అసలు అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలు. ఈ నెల 20 వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

నాసిరకం విద్యుత్ తీగలు..

పట్టణాల్లో జరిగే 30శాతం అగ్ని ప్రమాదాలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తోనే. దీనికి కారణం నాసిరకం విద్యుత్ తీగలు వాడడమే. తక్కువ ధరకు కొనుగోలు చేసిన నాసిరకం తీగలతో ఓవర్ లోడ్ విద్యుత్ సరఫరా జరిగినప్పుడు షార్ట్ సర్క్యూట్ ఏర్పడుతోంది. తీగలు తెగినప్పుడు కొందరు మధ్యలో అతుకులు వేస్తుంటారు. ఇలా చేయడంతో విద్యుత్ జాయింట్ వేసిన ప్రాంతంలో ఓవర్ లోడ్ విద్యుత్ సరఫరా అయినప్పుడు వేడికి కరిగిపోయి షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపిస్తాయి. తరుచుగా విద్యుత్ తీగలు మార్చుకోవడంతో ప్రమాదాలు నివారించవచ్చు.

అందుబాటులో అగ్నిమాపక పరికరాలు..

అగ్ని ప్రమాదాలు నిరోధించేందుకు అనేక పరికరాలు అందుబాటులో ఉంచాలి. పరిశ్రమలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్యపరమైన స్థలాలు, హోటళ్లు, బార్లు, సినిమా థియేటర్లు, కళ్యాణ మండపాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, లాడ్జీలు తదితర ప్రదేశాల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉండాలి. తక్కువ ధరలోనే లభించే ఈ పరికరాలు ఇళ్లలో సైతం ఏర్పాటు చేసుకుంటే మంచిది.

వంటగదిలో జాగ్రత్తలు....

సాధారణంగా ఇళ్లలో వంటగ్యాస్ లీకేజీతోనే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఐఎస్ఐ మార్క్ లేని నాసి రకం పైపు, నిర్ధేశిత రెగ్యూలేటర్ వాడకపోవడం కారణం. ముఖ్యంగా వంటగదికి కిటికీలు, వెంటిలేటర్లు ఉండాలి. గ్యాస్ లీకేజీ ఏర్పడినా బయటకు వెళ్లిపోతుంది. అలాగే గడ్డికుప్పలు, పత్తి, పత్తి కర్ర కుప్పలకు త్వరగా మంటలు వ్యాపిస్తాయి. జాగ్రత్తలు తీసుకుంటే మేలు.



మాతా శిశు కేంద్రంలోని వైద్య సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జిల్లాలో మూడేళ్లలో జరిగిన అగ్ని ప్రమాదాలు...

సంవత్సరం	అగ్ని ప్రమాదాలు	ఆస్తినష్టం రూ.లలో
2020–2021	184	రూ.2కోట్లు
2021–2022	124	రూ.88లక్షలు
2022– డిసెంబర్	152	రూ.కోటి 10లక్షలు

జిల్లాలోని ఫైర్ స్టేషన్ల ఫోన్ నంబర్లు....

అగ్నిమాపక కేంద్రం	అధికారి సెల్ నం.	ఫైర్‌స్టేషన్ ల్యాండ్/మొబైల్ నంబర్
మంచిర్యాల	8712699195	08736 252101/87126 99194
బెల్లంపల్లి	8712699199	08735 225101/87126 99198
జన్నారం	8712699197	08739 245101/87126 99196
చెన్నూర్	8712699201	08737 242101/8712699200

నివారణకు వినియోగించాల్సినవి...

- సోడా, యాసిడ్, నీటి కార్బన్‌డయాక్సైడ్ మిశ్రమాన్ని విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలకు తప్ప మరే అగ్ని ప్రమాదాలకైనా వాడోచ్చు. ఇందుకు సంబంధించిన రసాయన మిశ్రమాలు నింపిన పరికరాలు అందుబాటులో ఉంచాలి.
- పెట్రోల్, డీజిల్, ఆయిల్, గ్రీజ్ తదితర చమురు పదార్థాలు కాలుతున్నప్పుడు నీటిని పోయకూడదు. నీరు ఎక్కువగా బరువు ఉంటుంది. అందుకే నీరు మంటల కిందికి వెళ్తుంది. కానీ మంటలను ఆర్పివేయదు. అల్యూమీనియం సల్ఫేట్, సోడియం బైకార్బోనైట్ మిశ్రమం గల నురుగు గల పరికరాన్ని ఉపయోగించాలి.
- విద్యుత్‌తో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు గ్యాస్‌లాగా ఉండే కార్బన్ డయాక్సైడ్ గ్యాస్ పరికరాన్ని వాడాలి.

నిర్లక్ష్యం వల్లే అగ్ని ప్రమాదాలు



చిన్నపాటి నిర్లక్ష్యం వల్లే అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతీ శుక్రవారం ఏదైన ఓ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతోంది. అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చు.– అజయ్‌బాబు, జిల్లా ఫైర్ అధికారి, మంచిర్యాల

జీఎం హామీ అమలు చేయాలి

- తొలగించిన డ్రైవర్‌ను వెంటనే తీసుకోవాలి
- డ్రైవర్ల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న దూలం శ్రీనివాస్

శ్రీరాంపూర్: కాంట్రాక్ట్ కన్వేయన్స్ డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకుంటామని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ యూనియన్ కార్యాలయం వద్ద కన్వేయన్స్ డ్రైవర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. క్వాలిటీ జీఎంకు నడుస్తున్న అద్దె వాహనంపై పనిచేస్తున్న డ్రైవర్‌ను మార్చి 9న అన్యాయంగా తొలగించారని, దీనిని నిరసిస్తూ తాము మరుసటి రోజు నుంచి నిరవధిక రిలే దీక్షలు చేయడం, ఆందోళనలు చేయడం జరిగిందన్నారు. దీనిపై స్పందించిన ఏరియా జీఎం సంజీవరెడ్డి తమతో చర్చించి, ఆందోళనలు విరమిస్తే మూడు రోజుల్లో న్యాయం చేస్తామని, తొలగించిన డ్రైవర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనలు విరమించామన్నారు. ఇప్పటికీ సదరు డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తొలగించిన డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రీజియన్ అధ్యక్షురాలు వేల్పుల కుమారి, కన్వేయన్స్ డ్రైవర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతి, శివ, నాయకులు సతీశ్, వై శ్రీనివాస్, హుస్సేన్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య.. ఐదుగురిపై కేసు



వివరాలు సేకరిస్తున్న ఏసీపీ సదయ్య



రోదిస్తున్న కుటుంబీకులు, బంధువులు

బెల్లంపల్లి: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. బెల్లంపల్లి కన్నాలబస్తీకి చెందిన అపరాధ ప్రవళిక (24) అత్తింటి వేధింపులు తాళలేక సోమవారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నాలబస్తీకి చేరుకుని ఆందోళనకు దిగారు. పోలీసులు చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. మంగళవారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా తమ కూతురు ఆత్మహత్యకు కారణమైన భర్త అపరాధ సతీష్, అత్తమామలు మణెమ్మ, సారయ్య, ఆడ బిడ్డలు సుమలత, కావ్యలపై అదనపు కట్నం కేసు నమోదు చేస్తేనే పోస్టుమార్టం చేయాలని ఆందోళనకు దిగారు. దీంతో ఏసీపీ పంతాటి సదయ్య, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య, ఎస్సైలు రాములు, సమ్మయ్య, పోలీసు సిబ్బంది ప్రభుత్వాసుపత్రికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చట్టపరంగా నిందితులపై కేసు నమోదు చేస్తామని ఏసీపీ స్పష్టం చేయడంతో పోస్టుమార్టం చేయడానికి అంగీకరించారు. మృతురాలి తల్లిదండ్రుల నుంచి ఏసీపీ సదయ్య వివరాలు సేకరించారు. అనంతరం మండల తహసీల్దార్ కుమారస్వామి పర్యవేక్షణలో ప్రభుత్వ వైద్యుల బృందం ప్రవళిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

రూ.10లక్షలు అదనపు కట్నం కోసం..

అదనంగా రూ.10లక్షలు కట్నం తీసుకురావాలని తమ బిడ్డను అత్తారింటి వారు వేధించడంతోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు తోట లలిత, మల్లయ్య ఆరోపించారు. పెళ్లికి రూ.35లక్షలు కట్నం ఇచ్చామని, అదనంగా కట్నం తీసుకు రావాలని ఇబ్బందులు పెట్టడడంతో తనువు చాలించిందని తెలిపారు. పెళ్లైన 10 నెలల్లోనే తమ బిడ్డ తిరిగిరాని లోకానికి వెళ్లిందని కన్నీటి పర్యంతమన్నారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని ఏసీపీ స్పష్టం చేశారు.

హత్యకు పాల్పడిన వ్యక్తి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

లక్సెట్టిపేట: యువకుడి హత్యకు కారణమైన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ క్రిష్టారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన రాజమౌళి కూతురును అదే గ్రామానికి చెందిన అనిల్ (22) ప్రేమిస్తున్నాడని భావించాడు. ఈ నెల 14న అనిల్‌ను తీసుకుని బైక్‌పై మున్సిపల్ పరిధిలోని మోదెల గ్రామ సమీపంలోని టేకు చెట్ల వద్దకు తీసుకెళ్లాడు. ఇద్దరు కలిసి బీరు తాగారు. కొంతసేపటి తరువాత మరో బీరులో పురుగుల మందు కలిపి తాగాలని కత్తితో బెదిరించి తాగించాడు. అనిల్ ఇంటికి వెళ్లి కుటుంబీకులకు జరిగిన విషయాని తెలిపాడు. కుటుంబీకులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి ఈ నెల 16వ తేదీన మృతిచెందాడు. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు రాజమౌళిని రిమాండ్‌కు తరలించారు.

5న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మంచిర్యాలటౌన్: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మే 5న ఉదయం 10:30 గంటలకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కే.నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలన్నారు

జీఎల్ఎస్ఆర్‌లో నూతన కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: కాలనీలకు నీరందించే సీసీసీలోని గ్రౌండ్ లెవల్ స్టోరేజ్ రిజర్వాయర్(జీఎల్ఎస్ఆర్) సెక్షన్‌లో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం యూనియన్ రాష్ట ఉపాధ్యక్షుడు ముస్కె సమ్మయ్య, రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంపుల గణేశ్, కార్యదర్శిగా కొత్తపల్లి రాజు, ఉపాధ్యక్షులుగా పల్లవేణి హరీశ్, చొల్లంగి నాగరాజు, సహాయ కార్యదర్శులుగా నరేశ్, మహేశ్, కోశాధికారిగా రాజశ్రీ, ఆంజనేయులు ఎన్నికయ్యారు. 25న శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ముందు జరిగే మహాధర్నా విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజన్ కార్యదర్శి బూర వీరేశం, మండల కార్యదర్శి దొడ్డిపట్ల రవీందర్, నాయకులు నర్సింగరావు, ప్రభాకర్, తిరుపతి, నూకల రాజయ్య పాల్గొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్

దండేపల్లి: మండలంలోని ఊట్ల గిరిజన గ్రామానికి చెందిన కస్తూరి లచ్చన్న, ముడితే లచ్చయ్యలను తహసీల్దార్ హన్మంతరావు ఎదుట మంగళవారం బైండోవర్ చేసినట్లు తాళ్లపేట ఎఫ్ఆర్వో రత్నాకర్ రావు తెలిపారు. గతంలో వీరిద్దరూ కలప స్మగ్లింగ్ చేస్తూ పట్టుబటంతో కేసులు నమోదయ్యాయి. వీరు మళ్లీ కలప స్మగ్లింగ్ చేయకుండా ఉండేందుకు, బైండోవర్ చేసినట్లు ఎఫ్ఆర్వో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పోచమల్లు, ఎఫ్ఎస్వో హన్మంతరావు, ఎఫ్‌బీవో అనిత ఉన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన మడె శంకర్

భీమిని: మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో చింత చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... కేస్లాపూర్ గ్రామానికి చెందిన మడె శంకర్(49) చింతకాయ కోయడానికి మంగళవారం గ్రామంలోని చింత చెట్టుపైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారీ కింద నిలిపి ఉన్న ట్రాక్టర్‌పై పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

సిర్పూర్(టి): మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన ఆలం కమల(45) మతిస్థిమితం లేక సోమవారం రాత్రి ఇంట్లో కత్తితో చేతి నరాలు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం... కేశవపట్నం గ్రామానికి చెందిన ఆలం కమల కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి బాధపడుతోంది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స చేపిస్తున్నారు. సోమవారం రాత్రి మనికట్టుపై కత్తితో కోసుకుని కిందపడిపోయింది. కుటుంబీకులు గమనించేలోపే మృతిచెందింది. మృతురాలి కొడుకు ఆలం రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.

ఆస్తిపన్ను చెల్లించాలని నోటీసు

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధి సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలోని నిర్మాణాల ఆస్తి పన్ను చెల్లించాలని మున్సిపల్ అధికారులు శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డిని మంగళవారం కలిసి నోటీసులు అందజేశారు. ఈ నెల 31లోగా నిర్దేశించిన పన్నులను చెల్లించాలని కోరారు. గతంలో ఉన్న నాలుగు అసెస్‌మెంట్లకు గాను రూ.50 లక్షలు వసూలు చేశారు. ఇటీవల తిరిగి సర్వే చేయడంతో 1581 అసెస్‌మెంట్లకు గాను 2022–23 సంవత్సరంలో చివరి ఆరు నెలలకు గాను రూ.1,86,71,153 ఆస్తి పన్ను, 2023లో మార్చి 31 నాటికి మూడు నెలల ట్యాక్స్ రూ.14,86,742 కలిపి రూ.2,00,71,019 అయ్యింది. 2023–24 సంవత్సరానికి గాను ఎర్లీబర్డ్ స్కీం ద్వారా కంపెనీ చెల్లించాల్సిన మొత్తం రూ.3,71,68,554 చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ రమేశ్ తెలిపారు.

తాగొద్దన్నందుకు హత్య

- పెద్దనాన్నను హత్యచేసిన మరుదలి కొడుకు



పోశం మృతదేహం

జన్నారం: పొద్దస్తమానం తాగుతూ ఆరోగ్యం పాడు చేసుకోకుండా ఏదైనా పని చేసుకుని పెళ్లి చేసుకొమ్మని చెప్పిన పెద్దనాన్నను కర్రతో తలపై మోది హత్య చేసిన సంఘటన జన్నారం మండలంలోని మల్యాల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ వివరాల ప్రకారం... పడితే పోశం (70) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిరచుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన పోశం మరుదలి కొడుకు దాసండ్ల సుమన్ ఏ పనిచేయకుండా తాగుడుకు బానిసగా మారాడు. ఈ క్రమంలో పలుమార్లు తాగుడు మాని ఏదైనా పని చేసుకోవాలని పోశం సూచించాడు. ఎప్పుడు తనను మందలిస్తున్నాడని సుమన్ కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో పోశం రొటిగూడలో పనిముగించుకుని మంగళవారం ఉదయం ఇంటికి వెళ్తున్న క్రమంలో గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద కాపుకాసుకుని ఉన్న సుమన్ కర్రతో పోశం తలపై బాదడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు అక్కడికి వెళ్లడంతో నిందితుడు పరారయ్యాడు. మృతుడి కొడుకు పోశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పంచనామ చేసి పోస్టుమార్టం నిమిత్తం లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో ఒకరి మృతి

కాగజ్‌నగర్‌టౌన్: వడదెబ్బతో ఒకరు మృతిచెందిన సంఘటన పట్టణంలోని రిక్షా కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఇబ్రహిం (35) తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేసి జీవిస్తున్నాడు. సోమవారం ఎండలో వ్యాపారం కొనసాగించాడు. తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పట్టణ ఎస్సై చంద్రశేఖర్ సీహెచ్‌సీ చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలుకిందపడి ఒకరి ఆత్మహత్య

- తాగేందుకు డబ్బులు ఇవ్వకపోవడంతోనే..

మంచిర్యాలక్రైం: మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వక పోవడంతో మనస్తాపానికి గురై రైలు కిందపడి ఆత్యహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబల్ సంపత్ వివరాల ప్రకారం... పెద్దపెల్లి జిల్లా ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన రాదారపు సంపత్(39) రెండేళ్లుగా బతుకుదెరువు కోసం మంచిర్యాలకు వలస వచ్చి స్థానిక ఆశోక్ రోడ్‌లో నివాసముంటున్నాడు. సంపత్ స్వగ్రామంలో తనకు చెందిన అస్తిని అమ్ముకోగా రూ.5 లక్షలు వచ్చాయి. ఈ డబ్బులను తాగుడుకు ఖర్చు చేశాడు. పనిచేస్తూ వచ్చిన డబ్బులను తాగేందుకు ఖర్చు చేస్తున్నాడు. ఈ నెల 17న సాయంత్రం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వకపోవడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయి మంచిర్యాల శివారులోని గోదావరి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపారు.

యువకుడి దుర్మరణం

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలోని కాల్ టెక్స్‌రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలులో నుంచి జారిపడి యువకుడు మంగళవారం మృతిచెందాడు. బెల్లంపల్లి రైల్వే ఔట్ పోస్టు హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ వివరాల ప్రకారం... గుర్తు తెలియని రైలు మంచిర్యాల వైపు నుంచి కాగజ్‌నగర్ వైపునకు వెళ్తుండగా రైలులో నుంచి అబ్దుల్ జహీర్ (27) జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సదరు యువకుడు మంచిర్యాలలోని ఓ మెకానిక్ షాపులో పనిచేస్తున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపాడు.

దొంగ అరెస్టు

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్‌లోని నిజామ్ ఎలక్ట్రికల్ షాపులో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తాసినొద్దీన్‌మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నిజామ్ ఎలక్ట్రికల్ షాపు యజమని ఎండీ నిజామొద్దిన్ రోజువారిగానే దుకాణం బంద్‌చేసుకుని ఈ నెల 17న ఇంటికి వెళ్లిపోయాడు. ఉదయం షాపు తెరిచి చూడగానే షాపు కప్పు రేకులను తొలంగించి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. షాపులోని రూ.2వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు యజమాని ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా మంగళవారం స్టేషన్ రోడ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం నాగపల్లి గ్రామానికి చెందిన మోర్ల శంకర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి రూ.1000 నగదు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అధికారుల అడ్డగింత



రాస్తారోకో చేస్తున్న నిర్వాసితులు

దండేపల్లి: ఆర్మూర్–మంచిర్యాల వరకు గల 63వ జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించడం, గూగుల్ మ్యాప్ ప్రకారం రోడ్డు నిర్మాణం కోసం దండేపల్లి మండలం కన్నెపల్లి సమీపంలో అధికారులు మంగళవారం హద్దులు ఏర్పాటుకు వెళ్లారు. దీంతో నిర్వాసితులు అధికారులను అడ్డుకుని ఆందోళనకు దిగారు. నిర్వాసితులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు సంబంధించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, డిజైన్‌లో మార్పులు చేపట్టాలని తెలిపారు. గూగుల్ మ్యాప్ ప్రకారం రోడ్డును విస్తరించడంతో చాలామంది విలువైన ఆస్తులు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రెండు గంటలపాటు రాస్తారోకో చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. లక్సెట్టిపేట, దండేపల్లి పోలీసులు, రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులు వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వాళ్లు వినిపించుకోక పోవడంతో పోలీసులు ఆందోళనకారులను పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

జీజీహెచ్‌లో కొరవడిన పర్యవేక్షణ

- ఆసుపత్రి మార్చురీ వద్ద శిశువు మృతదేహం
- పోలీసులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫిర్యాదు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో పర్యవేక్షణ లోపం బయటపడింది. సోమవారం సాయంత్రం ఓ శిశువు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీ గది వద్ద ఓ కుక్క నోటితో పట్టుకుని వెళ్తుండగా, స్థానికులు గమనించి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో కుక్కకు అడ్డుకుని మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చగా... ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మంగళవారం విచారణ చేపట్టారు. సోమవారం మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఓ గర్భిణి ప్రసవించగా, తల్లి, బిడ్డల ఆరోగ్యం విషమంగా ఉండడంతో ఎంసీహెచ్‌లోని ఎస్ఎన్‌సీయూలోనే ఉంచి చికిత్స అందించగా, తల్లిని జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. సాయంత్రం శిశువు మృతిచెందడంతో తల్లికి చూపించేందుకు తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు చేసేందుకు అక్కడే ఉన్న ఇతరులకు అప్పగించారు. ఈ క్రమంలో ఆ శిశువును ఆసుపత్రి ఆవరణలోనే వదిలేసి వెళ్లడంతోనే కుక్క నోట కరిచి తీసుకెళ్తుండడం స్థానికులు గుర్తించి ఆసుపత్రి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. విచారణ చేపట్టిన పోలీసులు, శిశువు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి, వారి సమక్షంలోనే అంత్యక్రియలు జరిపించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు. శిశువు మృతదేహాన్ని బయట పడేయడంలో ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం గానీ, ప్రమేయం గానీ లేవని, ఆ శిశువు కుటుంబ సభ్యులు గుర్తు తెలియని వారికి మృత శిశువును అప్పగించడం వల్లనే జరిగి ఉంటుందని, పోలీసులు విచారణ చేస్తున్నారని పేర్కొన్నారు.

కులాల వారీగా జన గణన చేపట్టాలి

దండేపల్లి: జనగణనను కులాల వారీగా చేపట్టాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ చంద్రయ్య, మంచిర్యాల జిల్లా కన్వీనర్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. దండేపల్లిలో మంగళవారం సంఘ నాయకులతో సమావేశం అయ్యారు. కులాల వారీగా జనాభా లెక్కలు సరిగా లేకపోవడంతో రిజర్వేషన్ల శాతం నిర్ణయించడంలో ప్రభుత్వాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలి పారు. సంఘ నాయకుడు విజయ్, నాయకులు పాల్గొన్నారు.